# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 12-11-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

❖ రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు రేపటి నుండి తిరిగి ప్రారంభం కానున్నాయి.

❖ శాసనసభలో చేసే చట్టాల ద్వారానే ప్రజా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.

❖ మహిళలపై సామాజిక మధ్యమాల్లో దుష్ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి హెచ్చరించారు.

❖ విజయనగరం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించి నామినేషన్ పత్రాల పరిశీలన కార్యక్రమాన్ని ఈరోజు నిర్వహించారు.

❖ బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం అల్పపీడనంగా రూపాంతరం చెందిందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

========================

రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు రేపటి నుండి తిరిగి ప్రారంభం కానున్నాయి. నిన్న అసెంబ్లీ సమావేశాలలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ 2024-2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ ను సభలో ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్ పై రేపటి నుండి సభలో చర్చిస్తారు. ఈ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 22వ తేదీ వరకూ కొనసాగుతాయని శాసనసభాపతి అయ్యన్న పాత్రుడు పేర్కొన్నాయి. సభలో బడ్జెట్ ఆమోదం తరువాత అనేక కీలక బిల్లులు కూడా ప్రభుత్వం ప్రవేశపెట్టనుందని తెలిపారు. కాగా బడ్జెట్ పై శాసన సభ్యులకు అవగాహన కల్పించేందుకు ఈ రోజు సభకు సెలవు ప్రకటించారు.

========================

శాసనసభలో చేసే చట్టాల ద్వారానే రాష్ట్రంలోని అనేక సమస్యలకు శాశ్వత పరిష్కారాలు లభిస్తాయని ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు అన్నారు. అమరావతిలోని అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఈ రోజు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు

సభా నిబంధనలు, బడ్జెట్ అంశాలపైన అవగాహన సదస్సు నిర్వహించారు. శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... ప్రభుత్వం తెచ్చే బిల్లుల మీద ప్రతి ఎమ్మెల్యే అధ్యయనం చేయాలని సూచించారు. బడ్జెట్ సమావేశాలపైన అవగాహన పెంచుకోవాలని కోరారు. అసెంబ్లీని వేదికగా చేసుకుని ప్రజా సమస్యలను ప్రస్తావించాలన్నారు. శాసన సభ నిబంధనలు ప్రతీ శాసనసభ్యుడు తెలుసుకోవాలని స్పీకర్ కోరారు.

=========================

మహిళలపై సామాజిక మధ్యమాల్లో దుష్ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురంధేశ్వరి హెచ్చరించారు. విజయవాడలో ఈ రోజు పురంధేశ్వరి పాత్రికేయులతో మాట్లాడుతూ... సమాజంలో మహిళల మీద వేధింపులు ఎక్కువ అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

(వాయిస్ 32 సెకన్లు)

=========================

గ్రీన్ ఎనర్జీ విధానం ద్వారా రాష్ట్రంలో పెట్టుబడులు పెద్ద ఎత్తున ఆకర్షించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి సమక్షంలో ఈ రోజు రాష్ట్ర ప్రభుత్వానికి రిలయన్స్ సంస్థ ప్రతినిధుల మధ్య అవగాహన ఒప్పందం కుదురింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రిలయన్స్ సంస్థ రాష్ట్రంలో పెట్టె పెట్టుబడులతో 2 లక్షల 5 వేల మందికి ఉపాధి అవకాశం లభిస్తుందన్నారు. రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహించాలన్నది ప్రభుత్వం ఆలోచనగా వెల్లడించారు. ఇదిలా ఉండగా రిలయన్స్ సంస్థ రాష్ట్రంలో 500 బయోగ్యాస్ ప్లాంట్లను ఏర్పాటు చేయనుందని ఆ సంస్థ ప్రతనిధులు తెలిపారు. 65 వేల కోట్ల రూపాయలతో పెట్టుబడులు పెడుతున్నామని వెల్లడించారు.

=========================

ఉమ్మడి విజయనగరం జిల్లా స్థానిక సంస్థల శాసన మండలి ఉప ఎన్నికకు సంబంధించి నామినేషన్ పత్రాల పరిశీలన కార్యక్రమాన్ని రిటర్నింగ్ అధికారి సేతు మాధవన్, ఎం.ఎల్.సి ఎన్నికల పరిశీలకులు ఎం.ఎం.నాయక్ ఆధ్వర్యంలో ఈ రోజు నిర్వహించారు. నామినేషన్ దాఖలు చేసిన ముగ్గురు అభ్యర్థుల నామినేషన్ పత్రాలనూ ఆమోదయోగ్యమైనవి ప్రకటించారు. అభ్యర్థుల వివరాలను నోటీస్ బోర్డులో పెడతామని రిటర్నింగ్ అధికారి తెలిపారు. రేపు మధ్యాహ్నం 3 గంటల లోపు దరఖాస్తుల ఉపసంహరణ తరువాత తుది అభ్యర్థుల జాబితాను ప్రచురిస్తామన్నారు.

=========================

అమరావతి రాజధానికి సంబంధించి డిసెంబర్ నెలలో ప్రపంచ బ్యాంక్ నిధులు విడుదల అవుతాయని రాజధాని అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) కమిషనర్ కె.భాస్కర్ తెలిపారు. డిసెంబర్ 11న జరిగే ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఏడీబీ) బోర్డు సమావేశంలో, అదే నెల 17న జరిగే ప్రపంచ బ్యాంకు బోర్డు సమావేశంలో దీనికి సంబంధించిన ఆమోదం లభిస్తుందని తెలిపారు. ఈ రోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... అమరావతి రాజధాని రుణం 15 వేల కోట్ల రూపాయలలో 25 శాతం అంటే దాదాపు 3,700 కోట్ల రూపాయలను ఆ బ్యాంకులు అడ్వాన్సుగా విడుదల చేస్తాయని తెలిపారు. ఇదిలా ఉండగా, ఢిల్లీలో జరిగిన త్రైపాక్షిక సమావేశంలో రాజధాని రుణానికి సంబంధించి త్రైపాక్షిక ఒప్పందాలు సిద్ధమయ్యాయని సీఆర్‌డీఏ కమిషనర్ కె. భాస్కర్ తెలిపారు.

విరామం

=========================

బంగాళఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం అల్పపీడనంగా రూపాంతరం చెందింది. ఈ అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలోని దక్షిణ కోస్తానిలో వివిధ జిల్లాల్లో రానున్న మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఆ వివరాలను వాతావరణ శాఖ అధికారి తెలియచేస్తూ....

(వాయిస్ 30 సెకన్లు)

========================

అల్పపీడన ప్రభావంతో పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట మండలంలో భారీ వర్షం కురిసింది. ప్రధాన రహదారులతో సహా పలు కాలనీలకు వరదనీరు పోటెత్తింది. అలాగే ప్రకాశం జిల్లాలోని శింగరాయకొండలో అల్పపీడన ప్రభావంతో రాత్రి నుంచి వర్షం కురుస్తోంది. తుపాను ప్రభావం కారణంగా పాకల సముద్ర తీరంలో అలల ఉధృతి తీవ్రంగా ఉంది.

========================

రాష్ట్రంలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫీజు గడువును పొడిగిస్తూ... ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటన జారీ చేసింది. ఎలాంటి ఆలస్య రుసుము లేకుండా ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లింపు గడువును ఈ నెల 21వ తేదీ వరకు పొడిగిస్తూ.. ఇంటర్మీడియట్ విద్యామండలి కార్యదర్శి కృతిక శుక్లా ఒక ప్రకటన విడుదల చేశారు. 100 రూపాయల ఆలస్య రుసుముతో డిసెంబర్ 5వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చని ఆమె తెలిపారు. మొదటి లేదా రెండో ఏడాది చదివే విద్యార్థులు జనరల్ థియరీ సబ్జెక్టులకు 600 రూపాయలు, సెకండ్ ఇయర్ ప్రాక్టికల్ పరీక్షలకు 275 రూపాయలు, బ్రిడ్జి కోర్సు సబ్జెక్టులకు 165 రూపాయల చొప్పున ఫీజు చెల్లించాలని ప్రకటనలో వెల్లడించారు.

========================

తిరుపతిలోని శ్రీ గోవిందరాజ స్వామివారి ఆలయంలో ఈ నెల 15వ తేదీన పౌర్ణమి గరుడసేవ వైభవంగా నిర్వహించనున్నామని తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ఈరోజు ఒక ప్రకటనలో తెలిపింది. ప్రతినెలా పౌర్ణమి పర్వదినాన టీటీడీ గరుడ సేవ నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా సాయంత్రం 6 నుండి 8 గంటల నడుమ సర్వాలంకార భూషితుడైన స్వామివారు గరుడునిపై మాడ వీధులలో విహరించి భక్తులకు దర్శనమిస్తారని టిటిడి అధికారులు తెలిపారు.

========================

జాతీయ రహదారికి సంబంధించిన భూసేకరణ పనులు వచ్చే మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేయాలని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను కోరారు. శ్రీకాకుళం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ సంయుక్త కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్ తో కలసి సంబంధిత అధికారులతో ఈ రోజు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసన్నపేట మండలం జమ్ము నుండి పాతపట్నం ఎన్ హెచ్ 326A రోడ్డు బైపాసుకు సంబంధించి పనులపురోగతిపై కూడా సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

========================

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందే వినతులను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని విజయనగరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అధికారులను ఆదేశించారు. ఆర్‌డిఓలు, తహసీల్దార్లు, ఇతర రెవెన్యూ సిబ్బందితో ఈ రోజు కలెక్టర్ ఛాంబర్ నుంచి దృశ్య మాధ్యమం ద్వారా సమావేశం నిర్వహించారు. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులు వినతుల పరిష్కారంపై కలెక్టర్ సమీక్షించారు. ప్రజల వినతులను క్షుణ్ణంగా పరిశీలించి, పూర్తి స్థాయి పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు.

========================

ప్రకాశం జిల్లాలోని పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టును సిపిఎం నాయకులు ఈ రోజు సందర్శించారు. సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులు, సిపిఎం నాయకులు వై.వెంకటేశ్వరరావు, హనీఫ్, కొండారెడ్డి ప్రాజెక్టు ను పరిశీలించారు. ప్రాజెక్టు వివరాలను అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు.

==========================

తిరుమలలో టోకెన్లు లేని భక్తులకు 6 గంటల్లో సర్వదర్శనం అవుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు తెలిపారు. నిన్న స్వామివారిని 73 వేల 917 మంది భక్తులు దర్శించుకోగా కానుకల ద్వారా హుండీకి 4.82 కోట్ల రూపాయల ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు.

==========================

ఐక్యతకు ప్రతీకగా క్రీడలు నిలుస్తాయని శ్రీకాకుళం జిల్లాకు చెందిన పలువురు సామాజిక సేవకులు క్రీడారంగం నిపుణులు తెలిపారు. శ్రీకాకుళంలో ఈ రోజు పాత్రికేయులతో పలువురు క్రీడా కారులు మాట్లాడుతూ... ఒలింపిక్ క్రీడల్లో పతకాలు సాధించిన వారికి రాష్ట్ర ప్రభుత్వం 7 కోట్ల రూపాయలు పారితోషికం ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. క్రీడల కోటాను 3 శాతం పెంచడం మంచి పరిణామని యువత ఈ సదవకాశాన్ని వినియోగించికోవాలని కోరారు.

==========================
==========================